క్లుప్తంగా

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



జెండా ఊపి వారోత్సవాలు ప్రారంభిస్తున్న ఫైర్ సిబ్బంది

రాజాం సిటీ: స్థానిక అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఫైర్ ఎస్సై టీఎస్ఎస్ జనార్థనరావు ఈ కార్యక్రమం ప్రారంభించి, కాసేపు మాట్లాడారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో వివిధ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించనున్నామన్నారు. అంతకుముందు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నసంతర్పణ



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

రాజాం: బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండలంలోని అంతకాపల్లి గ్రామంలో ఉన్న టీటీడీ వారి శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నసంతర్పణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు రమణమూర్తి, టీటీడీ ఏఈవో జి.జగన్మోహన్ ఆచార్య పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

వంగర: మండల కేంద్రంలోని శ్రీషిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా సోమవారం నిర్వహించారు. ప్రధానార్చకులు ఆరవెల్లి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్త బొత్స వెంకటనాయుడు, లక్ష్మీ సింహాచలం దంపతులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న భక్తులు

వంగర: మండలంలోని కొప్పర గ్రామంలో కొత్తగా నిర్మించిన శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్తరాంధ్ర సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానందస్వామి ఆధ్వర్యంలో విగ్రహాల తిరువీధి, ఆలయంలో విగ్రహాల ఏర్పాటు, పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాజరాజేశ్వరీ దేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభయ్యాయి. తొలిరోజు అర్చకులు దూసి శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఘటాలు, ప్రభలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.అనంతరం ఆలయ ధర్మకర్త ఆదుర్తి రామకృష్ణ, విజయలక్ష్మి, తేన్నేటి వెంకటరమణమూర్తి, రమణి రేణుక, తోటకూర వెంకటసత్యనారాయణరాజు, భవాని దంపతులతో శివపార్వతుల కల్యాణం జరిపించారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన అక్కాచెల్లెళ్లు



వర్షిణి



వైదేహి

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని గొల్లపేటకు చెందిన అక్కా చెల్లెళ్లు (కవలలు) ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో సత్తా చాటారు. గొల్లపేటకు చెందిన మహంతి వెంకట వర్షిణి , వెంకట వైదేహి ఎంపీసీ విభాగంలో వరుసుగా 464, 465 మార్కులు సాధించారు. వీరి తల్లిదండ్రులు జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి, జనార్దనరావు దంపతులు. ఈ మేరకు విద్యార్థినులను పలువురు అభినందించారు.



వంగర: వంగరలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ తదితరులు



రామభద్రపురం: తహసీల్దారు కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దారు సులోచనరాణి తదితరులు



రామభద్రపురం: ఆరికతోటలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

దేశానికి దేవుడిచ్చిన వరం..అంబేడ్కర్

ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజాసంఘాల నాయకులు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులంతా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అంబేడ్కర్ దేశానికి దేవుడిచ్చిన వరమని, ప్రపంచానికి దేశమిచ్చిన గొప్ప బహుమతి అంబేడ్కర్ అని వక్తలు కొనియాడారు. కులవివక్ష నిర్మూలనకు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. ప్రధానంగా ఆర్థిక అసమానతలు తొలగించి, సామాజిక సమానత్వానికి ఆయన అహర్నిశలు పాటుపడ్డారన్నారు. ఆయన ఆశయ సాధనకు మనమందరం కృషి చేయాలని కోరారు. – బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



సంతకవిటి: వాల్తేరులో అంబేడ్కర్ జయంతి నిర్వహిస్తున్న గ్రామస్తులు



బొబ్బిలిరూరల్: దిబ్బగుడ్డివలసలో జరిగిన కార్యక్రమంలో జైభీమ్ నినాదాలు చేస్తున్న మాజీ సైనికులు, గ్రామస్తులు



సంతకవిటి: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు



మెంటాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు, ఎస్‌ఐ సీతారాం



బాడంగి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ నారాయణరావు తదితరులు



రాజాం సిటీ: కంచరాంలో అంబేడ్కర్ గొప్పతనం వివరిస్తూ ర్యాలీ



బాడంగి: పూడివలసలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సర్పంచ్ తిరుపతినాయుడు, ఎస్ఐ తారకేశ్వరరావు



బొబ్బిలి: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ముస్లిం సోదరులు



బొబ్బిలి: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన



తెర్లాం: పణుకువలస జంక్షన్‌లో జరిగిన కార్యక్రమంలో జోహార్ అంబేడ్కర్ అని నినాదాలు చేస్తున్న ఎంఈవో త్రినాధరావు, యూటీఎఫ్ నాయకులు



రాజాంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్



వంగర: పాతమరువాడలో అంబేడ్కర్ జయంతి సందడి



తెర్లాంలో అంబేడ్కర్ గొప్పతనాన్ని చాటిచెబుతూ స్థానికుల ర్యాలీ

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది..



మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: రాష్ట్రంలో అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం కాకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, ప్రజాస్వామ్య వ్యవస్థకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ విమర్శించారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. అన్నివర్గాల సంక్షేమం, అభివృద్ధిని ఆకాంక్షిస్తూ అంబేడ్కర్ మహనీయుడు రాజ్యాంగం రాస్తే.. ఆయన చేసిన చట్టాలు, హక్కులు అమలు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం విచారకరమన్నారు. రెడ్‌బుక్ పేరిట రాజకీయ కక్ష సాధింపులు చేస్తున్నారని దుయ్యబట్టారు. అక్రమ కేసులు పెట్టడం, అధికారులను భయపెట్టడం వంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలంతా గమనిస్తున్నారని, త్వరలోనే రెడ్‌బుక్ రాజ్యాంగ పాలనకు స్వస్తి చెబుతారన్నారు. ఇప్పటికైనా ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేయాలని, ఎన్నికల హామీలు అమలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని హితవుపలికారు.

సమావేశంలో పార్టీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడులు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, జెడ్పీటీసీ బండి నర్సింహులు, రేగిడి వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ సీట్లు అమ్మేసుకుంటున్నారు..



ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూములను కూటమి నాయకులు లాక్కొని ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నారని అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య ఆరోపించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా బొబ్బిలిలోని బాబాసాహెబ్ విగ్రహం వద్ద సోమవారం నివాళులర్పించి, కాసేపు మాట్లాడారు. రాష్ట్రంలో అగ్రవర్ణాల అభివృద్ధే కనిపిస్తోందని, అణగారిన వర్గాల ప్రగతి ఛాయలు కనిపించడం లేదన్నారు. బొబ్బిలిలోని గొల్లపల్లి రెవెన్యూ పరిధిలోని 19 ఎకరాల పేదల భూములు సహా మెడికల్ సీట్లను ఎమ్మెల్యే బేబీనాయన అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. ఇలాంటి అక్రమాలు జరిగితే పేదల సంక్షేమం, అభివృద్ధి ఎక్కడ సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వం అక్రమార్కులపై దృష్టిసారించి, చర్యలు తీసుకోవాలని కోరారు. – బొబ్బిలి

క్రికెట్ టోర్నీ విజేత బొబ్బిలి



విజేత జట్టు సభ్యులు

బొబ్బిలి: స్థానిక రాజా కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న పార్వతీపురం మన్యం జిల్లా పోస్టల్ శాఖ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ టోర్నీ విజేతగా బొబ్బిలి సబ్‌డివిజన్ జట్టు నిలిచింది. చీపురుపల్లి, బొబ్బిలి జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బొబ్బిలి జట్టు తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 12 ఓవర్లకు జరిగిన ఈ మ్యాచ్‌లో బొబ్బిలి జట్టు మొదట బ్యాటింగ్‌కు దిగి 62 పరుగులు చేసింది. అనంతరం 63 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన చీపురుపల్లి జట్టు 41 పరుగులు చేసి ఆలౌటైంది. విజేత జట్టుకు పార్వతీపురం మన్యం జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ చేతులమీదుగా ట్రోఫీ అందజేశారు.

రెండు పూటలా.. పనిచేయలేం..



ఉపాధి హామీ పథకం పనులను రెండు పూటలా పనిచేయలేమని తెలియజేస్తూ బాడంగి మండలం, వాడాడ గ్రామ వేతనదారులు సోమవారం నిరసనకు దిగారు. రోజురోజుకూ ఎండలు ముదురుతున్నాయని, ఉదయం 9 గంటల నుంచే శరీరం భరించలేనంత ఎండ తీవ్రత నెలకుంటోందన్నారు. మండుటెండలో పని చేస్తుండడంతో తీవ్ర అస్వస్థతకు గురవుతున్నామని వాపోయారు. కొంతమంది వడదెబ్బ బారినపడి ఆస్పత్రిపాలవుతున్నారన్నారు. ఇప్పటికైనా రెండు పూటలా పనిచేయాలన్న నిబంధన ఎత్తివేసి ఒక్కపూట పనికి అనుమతి ఇవ్వాలని కోరారు. లేకపోతే పెద్దఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అలాగే బకాయి వేతనాలు తక్షణమే అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎ.సురేష్ తదితరులు పాల్గొన్నారు. – బాడంగి

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



గుడ్డసంచులు పంపిణీ చేస్తున్న డీఎస్పీ రాఘవులు

రాజాం సిటీ: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు కోరారు. స్థానిక వికాస తరంగిణి సంస్థ కార్యాలయంలో ఆ సంస్థ సభ్యులు సమకూర్చిన ఐదు వేల గుడ్డసంచులను సోమవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ కవర్లను వినియోగించవద్దని సూచించారు. అందరం కలిసికట్టుగా ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేస్తేనే ఆరోగ్యవంతమైన సమాజం రూపొందించడం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ సెంట్రల్ ఆర్గనైజింగ్ కో–ఆర్డినేటర్ టీటీవీ రమణమూర్తి, వాకచర్ల వెంకటపైడిరాజు, మురపాక గణేష్, గడే అప్పలనాయుడు, ఆర్‌వీజే నాయుడు పాల్గొన్నారు.

కావాలనే మా స్థలం అడుగుతున్నారు..

భోగాపురం: ఎన్నో ఏళ్ల నుంచి మా ఆధీనంలో ఉన్న స్థలాన్ని వేరొకరికి ఇచ్చేందుకు అధికార పార్టీ నాయకులు కావాలనే అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని చెరుకుపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గుజ్జు వెంకటరమణ ఆరోపించారు. ఇదే విషయమై స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి సోమవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 70 మంది లబ్ధిదారులకు గ్రామంలో పట్టాలిచ్చారన్నారు. అయితే అప్పట్లో వారికి స్థలాలు చూపించలేదని.. అందులో కొంతమంది హైకోర్టును ఆశ్రయించడంతో వారికి స్థలాలు చూపించాలని రెవెన్యూ అధికారులను హైకోర్టు ఆదేశించిందన్నారు. దీంతో గ్రామంలోని జగనన్న కాలనీ సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో వారికి స్థలాలు కేటాయించారన్నారు. ఇటీవల మరో 12 మంది కూడా హైకోర్టును ఆశ్రయించడంతో వారికీ స్థలాలు చూపించాలని కోర్టు ఆదేశించిందన్నారు. జగనన్న కాలనీలో వారికి సరిపడ స్థలాలున్నప్పటికీ అధికార పార్టీ నాయకులు కావాలనే 45 ఏళ్లుగా తమ కుటుంబీకుల ఆధీనంలోని స్థలాన్ని అడుగుతున్నారన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకే అధికార పార్టీ నేతలు ఇలాంటి పనులు చేస్తున్నారని గ్రామపెద్ద అప్పలనరసయ్య మండిపడ్డారు.